# గుంటూరు వార్త



## పసుమర్రులో నూతన పట్టణ నిర్మాణం: మంత్రి రజిని

చిలకలూరిపేట, సెప్టెంబరు9, ప్రభాతవార్త: పేదలందరికి గృహనిర్మాణ పథకంలో భాగంగా పట్టణ పరిధిలోని పసుమర్రులో ఎకంగా ఒక కొత్త పట్టణాన్నే నిర్మిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని తెలిపారు. పసుమర్రు లేఅవుట్‌లో శుక్రవారం 1037 గృహల నిర్మాణానికి మంత్రి శంకుస్దాపన చేశారు. ఈ నిర్మాణాన్ని జెయన్‌ఆర్ అనే సంస ్దకు అప్పగించడం జరిగిందన్నారు. తానే స్వయంగా ప్రైవేటు సంస్దతో మాట్లాడి ఇళ్ల నిర్మాణం వేగవంతం అయ్యేలాగ



చర్యలు తీసుకున్నట్లు మంత్రి వివరించారు. ఆమోదపత్రాలు ఇచ్చిన లబ్దిదారులందరికి సంస్దే ఇళ్లు నిర్మించి ఇస్తుందన్నారు. 1037 మంది ఇప్పటివరకు ఆ కంపెనీనతో గృహలు నిర్మించుకునేందుకు సంసిద్దత వ్యక్తం చేయగా వాటికి శంకుస్దాపన చేయటం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేనిపెస్టోలో ఏదైతే చెప్పారో ఆ అంశాలన్నింటిని తూచా తప్పకుండా అమలు చేస్తున్నారని మంత్రి వివరించారు. పసుమర్రు లేఅవుట్‌లో 7865 మంది లబ్దిదారులు ఉన్నారని వీరందరికి ఉచితంగానే నివేశనా స్దలాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. టిడిపి నాయకులు మంచిపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని దీనిని ప్రజలు తిప్పికొడతారని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ లబ్దిదారులందరికి మెప్మా, వెలుగు ఆధ్వర్యంలో రుణాలు కూడా మంజూరు అయ్యేలా చూస్తామని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ శ్యాంప్రసాద్, మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమీషనర్ చుక్కల గోవిందరావు, తహసిల్దార్ జి సుజాత, హౌసింగ్ పిడి, ఎపియండిసి డైరక్టర్ మల్లెల రాజేష్‌నాయుడు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మద్దిరాల విశ్వనాధం, మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు కొలిశెట్టి శ్రీనివాసరావు, వలేటి వెంకటేశ్వరరావు, ముస్లిం మైనారిటి కార్పోరేషన్ రాష్ట్ర డైరక్టర్ షేక్ దరియావలి, పట్టణ పార్టీ వైసిపి అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, పార్టీ నాయకులు విడదల గోపి,గొంటు శ్రీనివాసరెడ్డి, కల్లూరి విజయకుమార్, షేక్ అలీమియా, షేక్ గాలిబ్‌షా, వడితే కోటానాయక్, తోట బ్రహ్మస్వాములు, బత్తినేని శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్లా, బషీర్ మేస్త్రి, బైరా కృష్ణ, కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, జాలాది సుబ్బారావు, మస్తాన్‌వలి, వైసిపి కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైకాపా ప్రభుత్వానికి అండగా ఉండాలి: మంత్రి మేరుగ



కొల్లూరు, సెప్టెంబరు 9, ప్రభాతవార్తః రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సచివాలయం మూడు పరిధిలో సాంఘీక సంక్షేమశాఖమంత్రి మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో గడప గడపకు మంత్రి తిరుగుతూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న విషయాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నిచోట్ల మురుగు కాలవలు సరిగాలేవని మంత్రి దృష్టికి మహిళలు తీసుకువెళ్ళారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండల వైసిపి పార్టీ అధ్యక్షుడు సూర్యదేవర రామకృష్ణ, వైస్ ఎంపిపి మురాల రాంబాబు, వేమూరు మార్కెట్‌యార్డు ఛైర్మన్ బి ఏడుకొండలు, జిల్లా నాయకులు కూచిపూడి మోషే, చిలకా ప్రకాష్, ఆళ్లమూడి మధుబాబు, జడ్‌పిటిసి చొప్పర సుబ్బారావు, వైసిపి నాయకులు ఘంటా శివరంగారావు, కనపర్తి మోహనరావు, ఎంపిటిసి సభ్యులు బుల్లా నవరత్నం, బావిరెడ్డి వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ ప్రారంభం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలంయ,సెప్టెంబరు9, ప్రభాతవార్త: సౌత్‌జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో కర్ణాటక జట్టు శుభారంబం చేసింది. శుక్రవారం నుంచి ఆచార్య నాగార్జున



విశ్వవిద్యాలయం వేధికగా 33వ జూనియర్ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ అట్టహాసంగా ప్రారంబమయ్యాయి. ప్రారంభ మ్యాచ్‌లలో కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఆశించిన స్థాయిలో రాణిస్తూ తమ విజయ పరంపరను కొనసాగిస్తున్నాయి. పోటీల నిర్వాహక కార్యదర్శి జి.శివప్రసాద్ ఫలితాలను వెల్లటించారు. అండర్-20 పురుషుల 5000మీటర్ల పరుగులో అరుణ్ శంకర్ మలవి, నర్సింగ్ పటేల్(కర్ణాటక), నితీష్‌కుమార్ (తమిళనాడు) బంగారు, వెండి కాంస్య పతకాలు సాధించారు. 800 మీటర్ల పరుగులో టి.వసంత్ బేకని (కర్ణాటక), అమల్దేవ్ (కేరళ), నాగరాజునన్ (తమిళనాడు), మహిళల విభాగంలో భాగ్యలక్ష్మి దొంతు (తెలంగాణ), పునీత రఘుపతి, శృతిక (తమిళనాడు)లు తొలిమూడు స్థానాలు సాధించారు. మహిళల 3000 పరుగులో ప్రియాంక (కర్ణాటక), మరియా థామస్ (కేరళ), దేవదర్శిని, యోగేశ్వర్ (తమిళనాడు), హరీష్ ముళ్ళు (ఆంద్రప్రదేశ్) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందారు. అండర్-18 పురుషుల 800 విభాగంలో పరుగు పోటీలో వినోద్‌కుమార్ బంతు (తెలంగాణ) రమేష్ కర్ణాటక శరణ్యన్ (కేరళ), మహిళల విభాగంలో కీర్తి (తమిళనాడు), మయూక, నివేద (కేరళ)లు వరుసగా మూడు స్థానాల్లో నిలిచారు. అండర్ 16 బాలుర 800మీటర్ల విభాగంలో ఆనంద్ ఆనంతయాన్ (తమిళనాడు), మహిళల విభాగంలో గాయత్రి (తమిళనాడు)లు బంగారు పతకాలు సాధించారు. అండర్ -20 మహిళల హైజంప్‌లో ఎస్.కె.వర్ష (తమిళనాడు), పురుషుల లాంగ్‌జంప్‌లో శ్రీ విక్రమన్ (తమిళనాడు), మహిళల 100మీటర్ల పరుగులో సిహెచ్ ప్రత్యూష (ఆంధ్రప్రదేశ్), అండర్18 పురుషుల జావలిన్ త్రోలో శశాంక్ పటేల్ (కర్టాటక)లు బంగారు పతకాలు పొందారు.

## ఆర్టీసీ బస్సులో రూ.30 లక్షలు మాయం..!

గుంటూరు క్రైం, సెప్టెంబరు 9, ప్రభాతవార్తః తాను ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సులో తన సూట్‌కేసులో ఉన్న నగదు మటుమాయమైనట్లు బాధితుడు పాతగుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన సున్నం వ్యాపారి బుధవారం చెన్నైలో నిర్వహించిన వేలంలో పాల్గొన్నాడు. మరళా అతను నగదు సూటికేసుతో రైలు ఎక్కి విజయవాడలో దిగాడు. అక్కడ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లి గుంటూరు బస్సు ఎక్కాడు. సూట్ కేసును తలపై ఉన ్న స్టాండ్ మీద పెట్టాడు. గుంటూరు వచ్చిన తరువాత సూట్ కేసును పరిశీలించడంతో దానిలో నగదు కన్పించలేదు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు నగదు కాజేశారంటూ పాతగుంటూరు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు

వివరాలు మెయిన్‌లో

## ప్రపంచ దేశాల చూపు భారత్ వైపే

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

పొన్నూరు, సెప్టెంబర్ 9,ప్రభాతవార్త: విద్యార్థులు ఇష్టపడిన దానికోసం కష్టపడితే నష్టపడేది లేదని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. చేబ్రోలు మండల పరిధి వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో "డెవలప్‌మెంట్ ఆఫ్ లీడర్‌షిప్ క్వాలిటీస్" అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా



హాజరైన భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం ఏ రంగంలోనైనా ప్రపంచ దేశాలన్నీ మనదేశం వైపే చూస్తున్నాయన్నారు. మంచి నాయకులుగా ఎదగాలనుకునే విద్యార్థులు క్రమశిక్షణ, గుణం, సామర్థ్యం, ప్రవర్తన, క్యాలిబర్ వంటి లక్షణాలను అలవరచుకోవాలన్నారు. విద్యార్థులందరూ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలన్నారు. విద్యార్థులు ఎంచుకునే ఏ రంగమైనా(డాక్టర్, యాక్టర్, ఇంజనీర్, సైంటిస్ట్, రైతు) కష్టపడడంతో పాటు మంచి అభిరుచితో ప్రయత్నిస్తే తప్పకుండా అభివృద్ధిలోకి వస్తారన్నారు. గొప్ప గొప్ప నాయకుల కృషి వలనే నేడు మనం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ఉత్సవాలను జరుపుకుంటున్నామన్నారు. విద్యార్థులందరూ కలలు కని వాటిని సాకారం చేసుకునే స్థాయికి ఎదగాలన్నారు. మన దేశంలోని యువత వద్ద ఆలోచనలకు కొదవలేదని, వాటన్నింటిని ఆచరణలోకి తీసుకువస్తే దేశం అభివృద్ధి పథంలోకి నడుస్తుందన్నారు. విద్యార్థులందరూ బాగా కష్టపడి చదివి, ఉన్నత స్థానాలను అధిరోహించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. నన్ను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అనే పిలిపించుకునే బదులు ముప్పవరపు వెంకయ్యనాయుడు అని పిలిస్తేనే ఎక్కువ సంతోషడతానన్నారు.

**నాయకత్వ లక్షణాలు అలవరచుకోవాలి: విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య**

విద్యార్థులందరూ నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలని విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. విద్యార్థులందరూ అవరోధాలు లెక్కచేయకుండా ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థులు ఎవరైనా మేము పేదవాళ్లం...ఏమీ చేయలేము అనే నిరాశావాదం వద్దని, కేవలం ఉద్యోగాలకే పరిమితం అవకుండా నాయకులుగా ఎదగాలన్నారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, మూడు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించిన ఘనత ఒక్క వెంకయ్యనాయుడుకే దక్కుతుందని విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. అనంతరం అమెజాన్‌లో నెలకు రూ.80వేల ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విజ్ఞాన్ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను వెంకయ్యనాయుడు సన్మానించారు. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో జగన్ అసమర్ధపాలన : మాజీమంత్రి 'ప్రత్తిపాటి'

చిలకలూరిపేట, సెప్టెం బరు9, ప్రభాతవార్త: రాష్ట్రం లో ప్రస్తుతం ఒక అసమర్ద పరిపాలన సాగుతుందని, దీనితో రాష్ట ్రంలోని అన్ని వర్గాల ప్రజలు అల్లాడిపో తున్నారని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో జరిగిన బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్బంగా గ్రామంలో కొవ్వొత్తు ర్యాలిని నిర్వహించారు. మద్యం ధరలు, ఇసుక ధరలు, పెంచిన రిజిస్ట్రేషన్ చార్జిలు,



ఆర్‌టిసి చార్జిలు, విద్యుత్ చార్జిలు, విద్యుత్ కోతల గురించి గడప గడపకూ గ్రామ ప్రజలకు పార్టీ నాయకులు వివరిస్తూ ర్యాలీలో ముందుకుసాగారు. జగన్ అధికారంలోకి రావటానికి రూ3వేలు పెన్షన్ ఇస్తానని చెప్పి ఇప్పుడు రూ2500 మాత్రమే ఇచ్చి ప్రజలను మోసంచేశాడని ప్రత్తిపాటి అన్నారు. వైసిపిలోని దళితులకు అన్యాయం జరిగితే టిడిపి వాళ్ళు వారికి సహాయంచేసి ఆదుకున్నా దానికి రాజకీయం చేస్తున్నారన్నారు. గతంలో రూ80 ఉండే మద్యం బాటిల్ ధరను ఇప్పుడు రూ 2వేలకు పెంచారన్నారు. సిమెంట్ బస్తా ధర రూ480కి పెరిగిపోయిందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక అన్ని ధరలు విపరీతంగా పెరిగిపోవటంతో ప్రజలు అనేకరకాలుగా ఇబ్బందిపడుతున్నారని ప్రత్తిపాటి విమరి ్శంచారు. దళితులుకు 200 యూనిట్లులోపు కరెంటు ఉచితంగా ఇసా ్తమని హమి ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలోకి తొక్కారని ప్రతి ్తపాటి అన్నారు. టిడిపి ప్రభుత్వం హయంలో విదేశి విద్యా పథకం క్రింద విదేశాలలో చదువుకునే దళితులకు ప్రభుత్వంనుంచి సహాయం అందించటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జవ్వాజి మదన్‌మోహన్, గ్రామపార్టీ అధ్యక్షుడు చంద్ర శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ చాపలమడుగు జగన్నాధం, పార్టీ నాయకులు మోషే, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ పరిధిలోని వివిధ హోదాలలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

రేపల్లె, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త; పార్టీలకు అతీతంగా అర్హులందరికి సంక్షే మ పథకాలు అందిస్తున్నట్లు ఎంపి మోపిదేవి వెంకటరమ ణారావు అన్నారు. గడపగడపకు కార్య ్యక్రమంలో భాగంగా రేపల్లెలోని 6,7 వార్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్బంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నయా లేదా అని అడిగితెలుసుకుంటున్నారు.వార్డులో ఏవైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబాన్ని





మోపిదేవి పరామర్శిస్తున్న తీరు పట్ల వార్డు ప్రజలు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షన్ని సైతం లెక్కచేయక తన వారసుడు మోపిదేవి రాజీవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఉత్సహంగా తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికి జగనన్న నవరత్నాలు అందిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్దిని చూడలేక టిడిపి నాయకులు రచ్చ చేస్తున్నారని విమర్శించారు.రాబోయేది కూడా జగనన్న ప్రభుత్వమేననే విషయాన్ని టిడిపి నాయకులు గుర్తించుకోవలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కట్టా మంగ, కౌన్సిలర్లు అకిశెట్టి భార్గవినాగరాజు,రెడ్డి శంకర్ , టికెవి గుప్తా, మీసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి, చీకటి వ్యాపారాలకు రారాజు జీవి: ఎమ్మెల్యే 'బొల్లా'

వినుకొండ,సెప్టెంబర్9,ప్రభాతవార్త: అవినీతి, అక్రమ చీకటి వ్యాపారాలు చేసి ప్రజల సొమ్ము దొరికినకాడికి దోచుకున్న సిగ్గుమాలిన చరిత్ర టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులుది అని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘాటు వ్యాఖ్యలతో విమర్శించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జీ.వీ ఆంజనేయులు ఇసుక, మట్టి, రేషన్, గుట్కా, మద్యం బెల్టుషాపులు వంటి అక్రమ వ్యాపారాలు చేసి కోట్లు కూడబెట్టారని ఆరోపించారు. కేవలం రాజకీయ స్వార్ధం కోసం ఉనికి కాపాడుకునేందుకు జీ.వీ తనపై నిరూపణకు సాధ్యం కాని అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. విజిలెన్స్ దాడుల్లో ఇటీవల పట్టుబడ్డ రేషన్ మిల్లు యజమాని టీడీపీకి చెందిన వ్యక్తి



కాదా అని ప్రశ్నించారు. గతంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా ఉన్న టీడీపీ నాయకులు ఇప్పటికీ అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్నారన్నారు. శావల్యాపురం మండలంలో అక్రమ మద్యం తరలిస్తుంగా టీడీపీకి చెందిన వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేయలేదా అని అడిగారు. జీ.వీ అనుచరులపై ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులు ఉన్నాయన్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కృష్ణపట్నంపోర్టు నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా విదేశాలకు తరలించి వచ్చిన డబ్బులతో పార్టీ కార్యకర్తలను పోషించిన దుర్మార్గమైన నేర చరిత్ర జీ.వీదని అగ్రహ ం వ్యక్తం చేశారు. రేషన్ అక్రమ రవాణాపై ప్రభుత్వం ఇప్పటికే కఠిన చర్యలు చేపట్టిందన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎన్ని కుట్రలు పన్నినా వినుకొండ అభివృద్ధిని ఎవ్వరు అడ్డుకోలేరని చెప్పారు. సమావేశంలో మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ బాలిరెడ్డి, జెడ్పి కో ఆప్షన్ సభ్యులు స్వెనోమ్, జెడ్పిటిసి జడ్డా సుబ్బులురామయ్య , ములకా రామతులసిరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని వైకాపా నేతలు బొక్కేస్తున్నారన్నది వాస్తవం కాదా?....తెదేపా జిల్లా అధ్యక్షుడు జీవీ సూటి ప్రశ్న 8



## వెంకయ్య నాయుడుకు 'కేసన' సత్కారం

గుంటూరు అర్బన్, సెప్ట ెంబర్ 9, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ బీసి సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ఆధ్వర్యంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును ఘనంగా సత్కరించారు. ఉపరాష ్ట్రపతిగా పదవీ విరమణ చేసిన వెంకయ్య నాయుడు శుక్రవారం తొలిసారిగా గుంటూరు విచ్చేసిన క్రమంలో స్థానిక రింగురోడ్డులోని



సిద్ధార్థ గార్డెన్స్‌లో ఆత్మీయసన్మానం జరిగింది.ఈ సందర్భంగా కేశన మాట్లాడుతూ తెలుగుజాతి,భాష తెలుగు ఖ్యాతిని దేశంలో నలుదేశాల విస్తరింప చేయడంలో వెంకయ్యనాయుడు కృషి స్ఫూర్తిదాయకమన్నారు.అలాగే చట్టసభలో అణగారిన వర్గాల సమస్యలపై అర్ధవంతమైన చర్చలు ఇటీవల జరగకపోవడం బాధాకరంగా ఉందని కేశం ఆవేదన వ్యక్తంచేశారు.అలానే బిపి మండల్ సిఫారు ్సలు యథావిధిగా అమలు జరిగేలా వెంకయ్య భవిష్యత్తులో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంఘ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్,గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నిమ్మల శేషయ్య,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు,బిసి నేతలు జొన్నాదుల నరసింహారావు,కన్నా మాస్టారు,తన్నీరు ఆంజనేయులు,మల్లెల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వరినాట్లు...

### వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీబిజీ



కారంపూడి, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త : నాగార్జున సాగర్ కుడికాలువకు సాగునీరు విడుదల చేయటంతో రైతులు వరినాట్లు వేసుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రతి ఏటా సాగర్ కుడికాలువ, నీటి సాగర్ కుడికాలువకు నీటి పారుదల శాఖాధికారులు ఆగస్టు నెలలో నీటిని విడుదల చేయటంతో వరినాట్లు వేసు కునేవారు. ఈ ఏడాది కొద్దిరోజులు ఆలస్యం కావటంతో రైతన్నలు ముమ్మరంగా వరినట్లు వేసుకుం టున్నారు. మండలంలో 28వేల యకరాల సాగుభూమి ఉండగా 11వేల యకరాలలో వరిపంట సాగుచేసుకునేందుకు రైతులు పొలాల బాటపట్టారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనుల్లో బిజి బిజీగా ఉన్నారు. ఇప్పటికే పత్తిపంట చివరి దశకు రావటం, మిర్చి పంటను వేసుకునేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఒప్పిచర్ల, నరమాలపాడు, లక్ష్మీపురం, మిరియాల, చింతపల్లి గ్రామాలలో ఎక్కువగా ఉన్నాయి. పొలం పనులు ఎక్కువగా ఉండటంతో



వ్యవసాయ కూలీల కొరత ఉంది. యర్రగొండపాలెం, మేకల దిన్నె, గండిగనుముల తదితర ప్రాంతాల నుంచి వ్యవసాయ కూలీలు పనుల కోసం మండలానికి చేరుతున్నారు. ముమ్మరంగా పొలం పనులు ఉన్నాయి. సాగర్ కుడికాలువ రైతన్నలకు వరంగా మారాయి. సాగర్ జలాలు రైతన్నల కళ్ళల్లో ఆనందాన్ని నింపాయి

ప్రభాత వార్త

స్టాఫ్ రిపోర్టర్లు, న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెట్‌వర్క్‌ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంటోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తి గలవారికి స్టాఫ్‌రిపోర్టర్లు, న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది.

అభ్యర్థులకు కావలసిన అర్హతలు

- 35 ఏళ్ళ లోపు వయస్సు
- ఇంటర్ లేదా డిగ్రీ
- స్థానికంగా నివాసం
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

స్టాఫ్ రిపోర్టర్లు, న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు

మాచర్ల మునిసిపాలిటీ, పిడుగురాళ్ల టౌన్, పిడుగురాళ్ల రూరల్, సత్తెనపల్లి, సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్, పత్తిపాడు టౌన్.

దుగ్గిరాల, నిజాంపట్నం, చేబ్రోలు

ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటాతో సంప్రదించగలరు

'వార్త' యూనిట్ కార్యాలయము

NH-5, చిలకలూరిపేట రోడ్, అంకిరెడ్డిపాలెం, గుంటూరు

ఫోన్ : 98481 71767

# వరుణుడి కటాక్షంతో ఊరట!

యడ్లపాడు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త : గ్రామాలలో జలకళ..నిత్యం పడుతున్న భారీ వర్షాలు..పొంగుతున్న వాగులు వంకలు..పెరిగిన భూగర్భజలాలు..కళకళ లాడుతున్న పంట పొలాలు..అనంద డోళికలలో రైతన్నలు..త్రాగు నీటికి పూర్తిగా తగ్గిన ఖర్చులు..వరుణుని కటాక్షంతో ప్రభుత్వానికి ఊరట. ..జీవులన్నింటికి అత్యవసర పదార్ధం.భూమిమీద వృక్షాలు, జంతువులు, మానవాళి మనుగడకు, వాటి పెరుగుదలకు గాలి తరువాత ముఖ్యమైనది నీరు. గ్రామాల్లో పట్టణాల్లో నివసించే కోట్లాది ప్రజలకు త్రాగునీరు సరఫరా చేయడం ఎన్నో ప్రభుత్వాలకు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య. వివిధ పంటల సాగుబడికి నీటి పారుదలకు సౌకర్యాలు అత్యంత అవసరమైనవి.



ఏ పరిశ్రమ కూడా తగినంత నీటి సరఫరా లేకపోతే స్థాపించడంగాని, నడపడంగాని సాధ్యపడదు. ఇది ప్రకృతి సమస్త జీవులకు ప్రసాదించిన ఒక అపురూపమైన పదార్ధము. నీరు ప్రకృతిలో ఉన్న సమస్త జీవులకు ప్రాణాధారము ప్రప్రథమ జీవి పుట్టుక నీటితోనే జరిగింది. నీరు ఈ భూమండలంలో 71శాతానికి పైగా అవరించి యున్నది. ఈ భూమి పై నీరు మూడు రూపములలో ఉంది. ఘన రూపము అనగా మంచు గడ్డల రూపంలో, ద్రవ రూపం సముద్రాలు నదులు తటాకములు మొదలగునవి, వాయు రూపంలో మేఘాలు అవిరి వంటి. ఈ నీటికొసం ప్రభుత్వాలు జలయజ్ఞవంటి కార్యక్రమాలకు కోట్ల రూపాయలు వెచ్చించింది. ..చిగురిస్తున్న రైతన్న అశలు..పడుతున్న వర్షం : బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావం కారణంగా గత రెండు రోజుల నుండి పడుతున్న వర్షాలకు రైతన్నలో అశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే ప్రత్తి పంట వేసి నలభై రోజులు పూర్తి కావస్తున్న తరుణంలో గత పదిరోజుల క్రితం పడిన వర్షాలకు తొలి బలం అందజేయటం జరిగింది. అయితే తదుపరి నుండి వర్షాలు లేక తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదు కావటంతో ఒకింత నిరుత్సాహం వ్యక్తపరిచారు రైతులు. అధిక ఉష్ణోగ్రతలకు మొక్కలు వడలిపోయే ప్రభావం అధికంగా కనిపించిందని, పడుతున్న వర్షానికి ఒకింత అశాజనకంగా ఉందంటున్నారు. ఇప్పటికే పొలాలలో ఉన్న కలుపు శుభ్రంచేసుకోవటం జరిగిందని, ఈ వర్షం ఎంతగానో ఉపయోగ పడుతుందని అంటున్నారు.

ప్రతీ సవంత్సరం సెప్టెంబర్ 18వ తేదిన ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవం నిర్వహించబడుతుంది. నీరు పరిశుభ్రంగా ఉంచుకుంటూ, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్న ఉద్దేశంతో ఈ దినోత్సవం జరుపబడుతుంది.

**..పెరిగిన నీటిమట్టం స్ధాయి :**

గ్రామాలలో గతంలో నీటి మట్టం సుమారు 58మీటర్ల మేర అడుగంటాయి. దీని కారణంగా గ్రామాలు తీవ్ర నీటి సంక్షోభంలో పోయాయి. దీని కారణంగా ప్రభుత్వాలు లక్షల రూపాయలు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించే కార్యక్రమాలు చేయటంతో ప్రభుత్వంపై అదనంగా భారం పడినట్లే అయ్యింది. దీని కారణంగా అధిక సంఖ్యలో నిధులు ఖర్చుచేయవల్సిన పరిస్తితులు నాడు నెలకొన్నాయి. నేడు దీనికి భిన్నంగా ఉంది. గడిచిన నాలుగు మాసాలలో ఇతర రాష్ట్రాలలో పడిన భారీ వర్షాలకు జలాశయాలు, డ్యాంమ్‌లు నిండి పొంగి పొర్లాయి. తదుపరి రాష్ట్రంలోని అన్ని జిల్లాలో కనిష్ట స్ధాయి నుండి గరిష్ట స్ధాయిలో వర్షాలు పడటం ప్రారంభం కావటంతో అన్ని కుంటలు, చెరువులు వర్షపు నీటితో కళకళలాడుతున్నాయి. ఇటు రైతులకు అనందోత్సవాలు వెల్లువెత్తాయి. పంటలు కళకళ లాడటంతో రైతులు ఉత్సాహంగా ఉరకలు వేస్తున్నారు. దీని కారణంగా గ్రామాలలో బోరులలో నీటిమట్టం పెరగటంతో నీటి తరలింపు ప్రక్రియ బ్రేక్‌పడింది. ప్రభుత్వానికి లక్షల రూపాయల ఖర్చు అదాఅయ్యింది. ఈ నిధులను వేరే పథకాలకు మళ్లించుకొనే వెసులు బాటు కలిగింది. వరణుడి కటాక్షంతో ప్రభుత్వం ఊరట చెందింది. గతంలో నీటి తరలింపు ప్రక్రియ వల్ల అధికారులకు, కాంట్రాక్టర్లకు కాసులు కురిపించింది. ఇదంతా నేడు నిలిచిపోవటంతో ఇటు ప్రజల పై భారం తగ్గినట్లే నంటున్నారు పలువురు మేధావులు.

# వినుకొండ అభివృద్ధే శ్వాసగా శ్రమిస్తా: ఎమ్మెల్యే 'బొల్లా'



నూజెండ్ల, సెప్టెంబర్9, ప్రభాతవార్త: రాష్ట్రంలో వైకాపా సంక్షేమాభివృద్ధి పాలన పవిత్ర గంగానది ప్రవాహంలా నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని లింగముక్కపల్లి గ్రామంలో గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, మండల పార్టీ సీనియర్ నేతలు,ద్వితీయ, తృతీయ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున బొల్లాకు సాదర స్వాగతం పలికారు. గడప-గడపకు వెళ్లిన ఎమ్మెల్యే బొల్లా గత మూడేళ్ళగా ప్రభుత్వం నుంచి ఏయే సంక్షేమ పథకాలు ద్వారా ఎంత లబ్ధి పొందారనే వివరాలను లబ్ధిదారులకు తెలియపరిచారు. తనపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీ.వీ అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అభివృద్ధికి అడ్డుపడటం మినహా జీ.వీకి ఇంకేం తెలీదని ఎద్దేవా చేశారు. తన ఊపిరి ఉన్నంత వరకు వినుకొండ అభివృద్ధే శ్వాసగా శ్రమిస్తానని అన్నారు. ఎంపిపి మేడం జయరామిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ గంధం బాలిరెడ్డి, సీనియర్ నాయకులు పరిమి శేషయ్య, తుపాకుల బ్రహ్మారెడ్డి, వంగూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలకు మాగులూరి ఫౌండేషన్ పౌష్టికాహారం



పెదకూరపాడు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : వివిధ మండలాల్లో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వందలాది మంది గర్భిణీలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణీలకు పౌష్టికాహారం అందించారు. మాగులూరి ఫౌండేషన్ వారి సేవలు గత 22 మాసాలుగా గర్భిణీలకు పౌష్టికాహారం అందించడమే కాకుండా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కృష్ణారావు, డాక్టర్ సునియా, సహ, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పూజలందుకున్న గణనాథుడు

పెదకూరపాడు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : వినాయక చవితి పండుగను 1893లో వీధుల్లో గణేష్ మండపాలు ఏర్పాటు చేయించి సామూహిక జాతీయ ఉత్సవంగా ప్రాముఖ్యతను తెచ్చారు. లోకమాన్య బాలగంగాధర్ తిలక్ కాగా, 75 తాళ్ళూరు ప్రాంతంలో వినాయక ఉత్సవాలకు ఆద్యుడు చిర్రా తిరుపతిరెడ్డి (అయ్యప్ప స్వామి) ఇంటికే పరిమితమైన వినాయకచవితి పూజ 1978 లో సామూహిక ఉత్సవంగా ప్రారంభించిన తిరుపతిరెడ్డి అయ్యప్పస్వామి ఆదర్శనీయుడు అనడంలో అతిశయోక్తి లేదు.



శబరిమల అయ్యప్ప దీక్ష కూడా ఈ ప్రాంతంలో మొదటగా కఠిన నియమాలతో ఆచరించి శబరి కొండకు వెళ్ళివచ్చిన వారికి కూడా ఆయన ఆదర్శంగా నిలిచారు. 1990 ప్రాంతంలో రెండవ తరంవారికి బాధ్యతలు అప్పగించారు. పెద్దల సహకారంతో యువకులు వినాయక ఉత్సవాలు కొన్ని మార్పులతో అంటే జనరేటర్ సాయంతో మైక్, లైటింగ్‌లతో, తీన్ మార్ వాయిద్యాలతో ఊరేగింపు జరిపేవారు. 2006 నుండి చిర్రా తిరుపతిరెడ్డి మనుమడు చిర్రా శ్రీనివాసరెడ్డి (డేగల శ్రీను) పూర్తి బాధ్యతలు స్వీకరించి ఉత్సవాలను ఆట, పాటతో క్రొత్త పుంతలు తొక్కించారు. కాలక్రమేనా ఉత్సవాలను గణపతి నవరాత్రులు నిర్వహించడం జరుగుతోంది. హైదరాబాద్ ప్రాంతంలో బాలాపూర్ గణపతి లడ్డు ఎంత ప్రాముఖ్యమో 75 తాళ్ళూరు గణపతి లడ్డు అంత ప్రాముఖ్యత సంతరించుకుంది. 75 తాళ్ళూరులో శుక్రవారం ఊరేగింపు జరిగింది. శనివారం నిమజ్జనోత్సవం జరుగుతుంది.

# ఘనంగా అనంత పద్మనాభ స్వామి వ్రతం



పెదకూరపాడు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : మండల పరిధిలోని 75 తాళ్ళూరు అవధూత అయోధ్యస్వామి ఆశ్రమంలో శుక్రవారం అనంత పద్మనాభ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ దేవి ఉపాసకులు అంకారావు మాస్టారు పాల్గొని భక్తులచే అనంత పద్మనాభ స్వామి వ్రతం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వేద మంత్రాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అంకారావు మాస్టారు మాట్లాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# నకరికల్లులో గడపగడపకు... కార్యక్రమంలో మంత్రి అంబటి



నకరికల్లు, సెప్టెంబర్ 9 ప్రభాతవార్త : మండల కేంద్ర మైన నకరికల్లులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర భారీ నీటి పారుదలశాఖామంత్రి అంబటి రాంబాబు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ గడపగడపకు కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్ళి సంక్షేమ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా మౌలిక వసతులు కల్పించడం, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రతి ఇంటికి సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాలను అందించారని తెలిపారు. వాటితో పాటు గ్రామాలలోనూ, పట్టణాలలోని వార్డులలోనూ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఈ కార్యక్రమం ద్వారా ప్రత్యేక నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. ప్రజా అవసరాలకు ప్రభుత్వం ఎంతటి ఖర్చునైనా భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు హరీష్, వైస్ ఎంపిపిలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బాషా, శాగం చంద్రశేఖరరెడ్డి, బైరెడ్డి ధనలక్ష్మి, మారెళ్ళ శ్రీనివాసరావు, మైనార్టీ విభాగం అధ్యక్షులు ఖలీల్, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యాన్ని వైకాపా నేతలు బొక్కేస్తున్నారన్నది వాస్తవం కాదా?....తెదేపా జిల్లా అధ్యక్షుడు జీవీ సూటి ప్రశ్న

వినుకొండ,సెప్టెంబర్9,ప్రభాతవార్త: రెక్కాడితే కానీ డొక్కాడనీ నిరుపేదల ఆకలి తీర్చడం కోసం పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అధికార వైకాపాకు చెందిన నాయకులు అక్రమంగా బొక్కేస్తున్నారన్నది నూటికి నూరు మాళ్ళ యదార్ధమని వాస్తవాలు కప్పిపుచ్చుకోవడం కోసం స్థానిక



ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్యాయంగా టీడీపీ నాయకులపై అవినీతి, అక్రమ ఆరోపణలు చేస్తున్నారని దీన్ని పూర్తిగా ఖండిస్తున్నామని తెదేపా జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీ.వీ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తనపైన టీడీపీ నాయకులపైన చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా దానికి జీ.వీ ఆంజనేయులుదే బాధ్యత అన్నచందంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతున్నారని పద్దతి మార్చుకోవాలని సూచించారు. రాజకీయ లబ్ధి కోసం వినాయక విగ్రహ ఊరేగింపుల్లో జీ.వీ గ్రామాల్లో గొడవలు చేయించారని దుష్ప్రచారం చేయడాన్ని నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎవరి నీతి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. వైకాపా రాక్షస పాలపై ప్రజలు పూర్తిగా తిరగబడేందుకు సిద్ధంగా ఉన్నారని దీంతో బొల్లాకు ఓటమి యం పట్టుకొని ఇటువంటి రాజకీయాలకు తెర తీశారని విమర్శించారు. టీడీపీపై చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. సమావేశంలో మీసాల మురళీకృష్ణయాదవ్, గడిపూడి విశ్వనాథం, రోడ్డా వీరాంజనేయరెడ్డి, గోరంట్ల హనుమంతరావు, పి.వి సురేష్‌బాబు, బత్తుల గోవిందరాజులు, వీరగంధం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు

## --నగర డిఎస్పీ వై. జెస్సిప్రశాంతి

గుంటూరు కల్చరల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త : యుక్తవయస్సు ఆడపిల్లలు ముఖ్యంగి విద్యార్థినులు క్షణికావేశంలో ఆత్మహత్యలే పరిష్కారమనే ఆలోచనా ధోరణి విడనాడి తమ భవిష్యత్తుపై దృష్టి నిలిపి అనుకున్న లక్ష్యాలు ఏకాగ్రతతో సాధించుకోవాలని నగర డిఎస్పీ వై.జెసీస్ ప్రశాంతి పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల వృత్తి విద్యా కళాశాల ఆవరణలో స్పందన




ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం"సందర్భంగా "లైఫ్ ఈజ్ ప్రిసీయస్--వ్యాల్యూ ఇట్" అంశంపై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ముఖ్యఅతిధిగా పాల్గొన్న డిఎస్పీ జెసీస్ ప్రశాంతి మాట్లాడుతూ సమస్యలు ముసురుకున్నప్పుడు పరిష్కారాలు ఆలోచించాలి గానీ కృంగిపోకూడదని చెప్పారు. ఇంటర్మీడియట్ డిగ్రీ ఐదు సంవత్సరాలు ఎవరి మనసులు వారి ఆధీనంలో ఉంచుకుంటూ ఏకాగ్రతతో చదువుపై దృష్టి పెట్టగలరో వారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని చెప్పారు విద్యార్థినుల చేత ప్రతిజ్ఞ చేయించారు.ఫౌండేషన్ డైరెక్టర్ ఈదా అంజిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఆనంద్‌బాబు ,ఫౌండేషన్ గౌరవ డైరెక్టర్ సిహెచ్ ఎస్.శ్రీనివాసమూర్తి,నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.కృష్ణభరత్,మహిళా విభాగం సహాయ కార్యదర్శి చంద్రిక శ్రీనివాసరెడ్డి,యోనా బాబు,శరత్ చంద్ర,విజయ్‌కుమార్,విజయలక్ష్మి,అధ్యాపకులు,విద్యార్థినులు, పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం

గుంటూరు కల్చరల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ పద్మావతి కళ్యాణమండపం వేదికగా ఆలయపాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య,కార్యవర్గ నిర్వహణలో జూపిటర్ ప్రసాదరావు,పద్మజ దంపతుల ఆధ్వర్యంలో శ్రీ భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం వారి సహకారంతో శ్రీ సీతారాముల వారి కళ్యాణం కనులపండువగా జరిగింది.తొలుత ప్రచారరథంతో పాటు ఆయోధ్యకు పంపనున్న సుమారు 8 కిలోల వెండి శ్రీరామ పాదుకుల భక్తుల సందర్శనార్థం ఉంచారు.తొలుత భద్రాచల ఆలయ ఈవో దంపతులు,జూపిటర్ ప్రసాద్ దంపతులు,ఆలయ పాలకమండలి వారు



శోభయాత్రగా స్వామివారి పాదుకలను ఊరేగించి బృందావన్ శ్రీనివాసుని ఆశీస్సులతో కళ్యాణ మండపం చేశారు.రుత్విక్కులు అత్యంత భక్తి శ్రద్దలతో వేదమంత్రాల నడుమ కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.శ్రీ కూర్మనాథన్ వ్యాఖ్యానంతో మంత్రార్ధలను కాలయాపన విశేషాలను వివరించారు.కార్యక్రమంలో విశేషంగా దంపతులు పాల్గొన్నారు.కళ్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ దంపతులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జూపిటర్ ప్రసాద్ మాట్లాడుతూ శనివారం రాజధాని ప్రాంతమైన మందడం గ్రామంలో ఆదివారం పెనుమాక గ్రామంలో శ్రీసీతారాముల కళ్యాణం భద్రాచల అర్చకులచే విశేషంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

# పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి



గుంటూరు రూరల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్తః బాలింతలు, గర్భిణీలు పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని పలువురు సూచించారు. గుంటూరు నగర శివారు 16వ డివిజన్ ఏటుకూరు అంగన్‌వాడి కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహార దినోత్సవ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జి.వి.లలితా దేవి, ఎల్‌హెచ్‌పి ఎం.ప్రియాంక, అంగన్‌వాడి కార్యకర్తలు రోజారాణి, సబిత, ఆశా కార్యకర్తలు ధనలక్ష్మి, సంపూర్ణ, టి.ధనలక్ష్మి, చిన్నారులు పాల్గొన్నారు.

# నేడు ఏపి ఓపెన్ టెన్త్,ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

గుంటూరు విద్య, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త : రాష్ట్రవ్యాప్తంగా ఈఏడాది ఆగస్టులో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ టెన్త్,ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను శనివారం ఉదయం 11గంటలకు విడుగల చేయనున్నట్లు ఒపెప్ స్కూల్ రాష్ట్ర డైరెక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు.ఫలితాల కొరకు www.APOPENSCHOOL.AP.GOV.IN.వెబ్‌సైట్ ద్వారా ఆయా అభ్యర్థులు ఫలితాలను తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

# 30 కుటుంబాలు వైకాపాలో చేరిక

వినుకొండ,సెప్టెంబర్9,ప్రభాతవార్త: వినుకొండలో వైకాపా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పనితీరు బాగుండటంతో ప్రజలు స్వచ్ఛందగా వైకాపాలో చేరేందుకు క్యూ కడుతున్నారు. మూడేళ్ళ పాలనలో బ్రహ్మనాయుడు చేసిన అభివృద్ధి గతంలో ఏ ఎమ్మెల్యే చేయలేదని బాహాటంగానే అంటున్నారు. పార్టీ చేరికల్లో భాగంగా నూజెండ్ల మండలం గుర్రప్పనాయుడుపాలెం గ్రామం నుంచి టీడీపీకి చెందిన దాదాపు 30 కుటుంబాలు ఎమ్మెల్యే బొల్లా సమక్షంలో వైకాపాలో చేరారు. పార్టీలో చేరిన వారికి వైకాపా కండువాలు వేసి ఎమ్మెల్యే బొల్లా సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బ్రహ్మ నాయుడు మాట్లాడుతూ సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వినుకొండలో జరుగుతున్న అభివృద్ధిపై ప్రతి సామాన్యుడికి పూర్తి స్థాయిలో అవగాహన ఉందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ, నియోజకవర్గ, నూజెండ్ల వైకాపా సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల నుండి బయటపడేందుకు ఆత్మహత్యలు శరణ్యం కాదు



**--ఆత్మహత్యల నివారణలో కుటుంబపాత్ర కీలకం**
**--నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం**

గుంటూరు మెడికల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త : వివిధ రకాల సమస్యల కారణంగా నేటి సమాజంలో అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని,సమస్యల నుండి బైట పడేందుకు ఆత్మహత్యలు పరిష్కారం కాదని జిజిహెచ్ మానసిక వ్యాధుల విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.సాయి కిరణ్ పేర్కొన్నారు.ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఆత్మహత్యల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై డాక్టర్ సాయి కిరణ్ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ గణాంకాల ప్రకారం ఇతర దేశాలతో పోలీస్తే మనదేశంలో ఆత్మహత్యలు చేసుకునేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు.ఆత్మహత్యలు ఎక్కువగా తీవ్ర మానసిక ఒత్తిడి,జీవితం పట్ల నిరాశ,నిస్పృహ, కుటుంబ,సామాజిక,ఆర్థిక సమస్యల కారణంగా ఎక్కువగా సంభవిస్తున్నాయన్నారు.ఆత్మహత్య మరణాలు స్త్రీల కంటే పురుషులే ఎక్కువగా ఉంటున్నారని తెలిపారు.అలాగే ఆరోగ్య కారణాలు,కుటుంబ సభ్యుల ఆదరణ కరువైన 60ఏళ్ళు పైబడిన వృద్ధులు ఆత్మహత్యలకు పాల్పడడం ఆందోళన కల్గించే అంశమన్నారు.పట్టణ ప్రాంతాల్లో నివశించే వారిలో ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులు ఉన్న పేదలు,కృంగుబాటుతో బాధపడేవారు,మధ్యపాన వ్యసనపరులు,గృహహింస,సంసారంలో సమస్యలున్నవారు,ప్రేమ విఫలమైన వారు పరీక్షల్లో తప్పినవారు,నిరుద్యోగస్తులు,ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు ఓ సర్వేలో తేలిందన్నారు.నేటి యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరూ తీవ్ర మానసిక ఒత్తిడికి లోనౌవుతున్నారన్నారు.దీన్ని అధిగమించేందుకు యోగా,వ్యాయామం,ధ్యానం వంటి సాధనాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.నేర్పు,ఓర్పు,పాజిటివ్ ఆలోచనలతో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని గ్రహించాలని సూచించారు.ఆత్మహత్యకు అవకాశమున్న వారికి మానసిక వైద్యుని కౌన్సిలింగ్,మందులతో పాటుగా కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు ఎంతో అవశ్యకమన్నారు.

# ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు సీమంతం



చిలకలూరిపేట, సెప్టెంబరు9, ప్రభాతవార్త: చిలకలూరిపేట ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని సుగాలి కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కాలనీకి చెందిన 5గురు బాలింతలకు ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లపాటి రాజ్యలక్ష్మీ, నార్నె జయలక్ష్మిలు చీరెలు, గాజులు, మిఠాయిలు, పూలు, పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ గర్భం దాల్చిన సమయంనుంచి బిడ్డ పుట్టేవరకూ వారు తీసుకోవాలి సిన జాగ్రత్తల గురించి వివరించారు. పౌష్టికాహారం లోపం లేకుండా చూసుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డైరక్టర్లు గట్టు సరోజని, కందిమళ్ల అంజనాదేవి, అంగన్‌వాడి ఎడబ్ల్యులు వర్ధిని, ప్రసన్నలక్ష్మిలు పాల్గొన్నారు.

# దత్తసాయి పీఠంలో అన్నదానం



చిలకలూరిపేటటౌన్, సెప్టెంబరు9, ప్రభాతవార్త: పట్టణంలోని సుబ్బయ్యతోటలో ఉన్న దత్తసాయి పీఠంలో శుక్రవారం మున్సిపల్ కమీషనర్ గోవిందరావు కుమార్తె లక్ష్మీ హృత్విక పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జయజయసాయి ట్రస్ట్ ఛైర్మన్ పూసపాటి బాలాజి కమీషనర్ దంపతులను సత్కరించి బాబా ఆశిస్సులు అందచేశారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని కమీషనర్ దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సిబ్బంది ఖాదర్, పీఠం సభ్యులు మానేపల్లి సుధాకర్,కొత్తూరి హనుమంతరావులు పాల్గొన్నారు.

# సిపిఐ జాతీయ మహసభల పోస్టర్ల ఆవిష్కరణ

చిలకలూరిపేట, సెప్టెంబరు9, ప్రభాతవార్త: రానున్న ఎన్నికలలో కేంద్రంలో ఉన్న బిజెపికి, రాష్ట్రంలో ఉన్న వైయస్ఆర్‌సిపికి ఓటువేస్తే దేశం, రాష్ట్రం అధోగతిపాలవు తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో




విజయవాడలో అక్టోబరు 14వ తేదీనుండి జరగనున్న 24వ జాతీయ మహసభల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. విజయవాడలో జరగనున్న సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అక్టోబరు 20వతేదీలోగా టిడ్కో గృహలను లబ్దిదారులకు అందచేయాలని లేని పక్షంలో ఆ గృహల వద్ద సిపిఐ ఆధ్వర్యలో లబ్దిదారులతో కలసి నిరాహరదీక్షకు దిగుతామని ముప్పాళ్ల హెచ్చరిం చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వర ప్రసాద్, చిలకలూరిపేట ఏరియా కార్యదర్శి నాగభైరు సుబ్బాయమ్మ, ఎఐవైయఫ్ పల్నాడు జిల్లా ఇన్‌చార్జి షేక్‌సుభాని, ఏఐటియుసి ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, సిపిఐ నాయకులు చెరుకుపల్లి నిర్మల, చౌటుపల్లి నాగేశ్వరరావు, మంత్రునాయక్, లలిత కుమారి, శివలీల, సుబ్బాయమ్మ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జయప్రకాష్‌రెడ్డికి ఘననివాళి




గుంటూరు కల్చరల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త : ప్రేక్షకులను భయపెట్టినా,నవ్వించినా తెరపై ప్రతినాయకుడిగా కన్పించినా తననటనతో ప్రతి ఇంటికి దగ్గరైన విలక్షణ నటుడు జయప్రకాష్‌రెడ్డి అని అవగాహన సంస్థ సభ్యులు నివాళులర్పించారు. శుక్రవారం అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో రంగస్థల సినీ నటులు జయప్రకాష్‌రెడ్డి ద్వితీయ వర్ధంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు,గాయకులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ నటనకు ప్రాణం పోసే నటులు అరుదుగా ఉంటారని,అలాంటి వారిలో జయప్రకాష్‌రెడ్డి ఒకరన్నారు.అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ తెలుగు చిత్ర చరిత్రలో సరికొత్త విలనిజాన్ని పరిచయం చేసిన నటుడు జయప్రకాష్‌రెడ్డి అన్నారు.తొలుత జయప్రకాష్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో అధ్యాపకులు సుబ్బారెడ్డి,గాయకులు రాజశేఖర్,రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి,వెంకటరావులు పాల్గొని నివాళులర్పించారు.

